**అన్యాయాన్ని నోరు మూసుకుని భరిస్తున్నంతకాలం బ్రతుకంతా చీకటే. తెలుసు తెచ్చుకుంటేనే వేకువరేకలు విరిసేది.**

గోధూళి వేళ.

కాంతం రావిచెట్టు మలుపువరకూ వచ్చి ఆగిపోయింది. ఆ చెట్టు కిందకు రాగానే ఏదో గుబులు. ఆ చెట్టు దాటిపోతుంటే అమ్మ నొదిలిపెట్టిపోతున్నట్టు ఏదో దిగులు.

ఒకసారి వెనక్కు తిరిగి చూసింది కాంతం. దూరంగా గుడిసెలమీద నుంచి పొగ దట్టంగా లేస్తోంది. ఆ పొగ మబ్బుల్లోంచి నీరెండ విద్ర కారిగిన సూర్యుడు బద్ధకంగా చూస్తున్నట్టుంది.

నాలుగడుగులు ముందుకు వేసిన సాంబయ్య విసుగ్గా వెనక్కు చూసి నిలబడిపోయాడు.

కాంతానికి పదేళ్ళకిందట సాంబయ్యతో కాపరానికెళ్ళిన రోజు గుర్తొచ్చింది.

ఆ రోజు తనను సాగనంపడాని కొచ్చి నోళ్ళంతా కళ్ళు తుడుసుకుంటా యిక్కడే నిలబడిపోయారు. సరిగ్గా ఈ మలుపులోనే అందర్నీ వొదిలెళ్ళి పోతన్న గుబులుతో తనెక్కెక్కి ఏడుత్తుంటే సాంబయ్య యిలాగే యెనక్కుతిరిగి చూసి యిసుక్కున్నాడు. ఇవాళ పంపడానికెవరూ రాలేదు. ఏడుపూ రావడంలేదు. కాని.... కాని.

సరిగ్గా సమయానికి ఊరెళ్ళింది పంతులమ్మగారు. ఉంటె ఆవిడేం సలాచెప్పేదో అనుకుంది.

"కోళ్ళనేం జేశావ్?"

"బోడెమ్మత్తకప్పజెప్పా."


"అమ్మిపారేద్దాం. ఆ గుడిసెకూడా."

కాంతం బదులు పలకలేదు.

పొరుగూరు కూలికెళ్ళిన జనమంతా ఎదురొస్తున్నారు.

"కాంతమ్మా ఎల్లిపోతున్నావా?"

"మల్లెప్పుడొత్తావె కాంతా?"



సంక్రాంతి ముగ్గు — చిత్రం : సుహాసిని, రాజమండ్రి

"ముసిల్దాన్ని గేపకముంచుకుంటావంటే?"

కాంతం చుట్టూచేరి ఆపేక్షగా పలకరిస్తున్నారు.

"పట్నమని కోసున్నరలేదు. ఎంతదూరమనే ఊరికె యిదై పోతారూ?" అందో పడుచుపిల్ల సాంబయ్యను వోరగ చూస్తూ.

"ఓరల్లుడా పిల జాగరతరో?"

"జాగరత పెట్టుకోడానికే కద తీసికెల్తన్నాడు."

అందరూ గలగల నవ్వారు.

"యామాత్ర కాపర వెక్కడెడతారే? మనూళ్ళో వుండండె. పెట్టిలాటిల్లుంది. కోళ్ళు... దూళ్ళు సూసుకుంటా కూలీనాలీ పేసుకుని కమ్మగా వుండొచ్చు" అంది గంగవ్వ.

పీచులా రేగిన తలా, వయసును మోస్తున్నట్లు ఒంగిన నడుమూ, ముడతలుబడ్డ ముఖమూ, లోతుకుపోయిన కళ్ళలో రవంత తడీ.

గంగవ్వకేసి దిగులుగాచూస్తూ "యెట్టుంటదో మరి" అంది కాంతం.

"మాకిల్లూ వాకిలీ లేదేంటి. అన్నీ అమ్మిపారేసి అక్కడే ఉంటాం" దురుసుగా అన్నాడు సాంబయ్య.

"అమ్మకోడవెందుకురా. ముసిలాడి పేరు పెడగొట్టవాకంద్రా. కొనబోతే కొరివీ. అమ్మబోతె అడవీ లాగుంది ప్పుడు. నా మాటినయ్యా?"


ఇల్లమ్మడమంటే గంగవ్వ ప్రాణం గిలగిల్లాడింది.

"ఏదో ఒకటి జేసుకుంటాం నీకెందుకు పోవే ముసిల్దానా" విసురుగా ముందుకు నడిచాడు సాంబయ్య.

"ఓరి నీ అదిరిపాటు పెడా. ఒల్లు పెంచావుగాని బుద్ధి పెరగలేదురా నీకు."

గొణుక్కుంటూ ఊరిదారి పట్టింది గంగవ్వ.

గంగవ్వ ఆరాటం సూత్తుంటె పదేళ్ళ కిందట తనను కాపరానికి పంపిత్తూ కుళ్ళి కుళ్ళి ఏడ్చిన అమ్మ గుర్తొస్తంది కాంతానికి. అడుగులు ముందుకు పడటంలే



# వేకువ రేకలు

బి. సుజాతాదేవి

ఆలోచనలు వెనక్కి పరిగెడుతున్నై.

పదేళ్ళ క్రితం.

గూడెం పెద్ద మంగాయ్ మనవరాలు కాంతం. మోతుబరుల తగాదాల్లో అల్లుడు పోతే కూతుర్నీ, మనవరాల్నీ కంట్లో పెట్టుకు సాకాడు మంగాయ్.

పదహారేళ్ళకే పక్క ఊరి పెంటయ్య కొడుకు సాంబయ్యతో పెళ్ళయింది కాంతానికి. అప్పటికే ఇరవై ఏళ్ళు దాటిన సాంబయ్యకు జులాయిగా తిరుగుతాడని పేరున్నా కుటుంబం మంచిదని మురిసిపోయి పిల్లనిచ్చాడు మంగాయ్.

నాలుగు పందుల్ని కోసి ఊరంతా విందు చేశాడు. సన్నాయిమేళం, పల్లకీ ఊరేగింపు. అంతకుముందు ఎవ్వరూ చెయ్యనంత ఘనంగా అయింది పెళ్ళి.

తరువాత అత్తారింట్లో మూడునెలలు దిన దిన గండం నూరేళ్ళాయుషులా గడిపింది కాంతం.

ఒక రాత్రి నగానట్రా మూటగట్టుకుని డబ్బూ దస్కం చేతబట్టుకుని సాంబయ్య గడప దాటడంతో, కాంతం గండం గట్టెక్కి మళ్ళా తల్లికడుపున పుట్టినట్లు పుట్టింటికొచ్చిపడింది.

ఆ తరవాత ఆరేళ్ళకు సాంబయ్య ఓడరేవులో వుద్యోగం వొచ్చిందని తండ్రికి వుత్తరం వ్రాశాడన్నారు. కాంతానికి మారుమనువు చెయ్యమని వూళ్ళో అంతా అన్నారు. తాతా సిద్ధపడ్డాడు కాని పెళ్ళి పేరెత్తితే చాలు చలీ జరం వొచ్చినట్లు వొణికిపోయేది కాంతం. తను కన్నుమూస్తే దాని




పెండ్లికి ముందు, తర్వాత



నరముల బలహీనత, శుక్ల నష్టము, శీఘ్ర స్ఖలనము, ఇతర సెక్స్ సమస్యలకు పోస్టుద్వారా చికిత్స కలదు. వివరాలకు 50 పైసల స్టాంపులు పంపండి.

డాక్టర్ బాబా L A M S V. V.
Asst డాక్టర్స్
A. సర్దార్ R.M.P.V.V.
A. యక్బాల్ R.M.P.V.V.
బాబా అండ్ కో ఆస్పత్రి,
తాలూకా ఆఫీసు ఎదుట, విజయవాడ—3.

స్వీట్ ఆర్ట్స్ వారి సంక్రాంతి గ్రీటింగ్ కార్డులు
వినియోగదారులకు
6 కార్డులు (6 రకాలు) రు. 9-00
డీలర్లకు ప్రత్యేకం
24 కార్డులు (6 రకాలు) రు. 24-00
మనియార్డర్ గాని పోస్టల్ ఆర్డర్ గాని పంపితే
రిజిష్టర్డు పోస్టులో పంపుతాము. వి.పి.పి. లేదు.
SA-2
Cards Crafts Classics
12-E Byramjung Bhahadur Lane
Post Box No. 2421, Madras-600 002

బతుకేమవుద్దో అని తాత దిగులు పడుతుండేవాడు.

మూడేళ్ళ కిందట అమ్మ మంచమెక్కింది. మళ్ళా దిగలేదు. ఆ మరుసటేడే తాత తిరుగుతా తిరుగుతానే పడిపోయాడు మళ్ళీ లేవలేదు. తండ్రి పోయిన్నాడుకాదు. తాతపోయిన్నాడు నిజంగా దిక్కులేనిదైంది కాంతం అన్నారంతా.

నోరు మంచితనంతో గంగవ్వ సాయంతో కొత్తజీవితాని కలవాటు పడిపోయింది కాంతం. కొత్త పంతులమ్మ ఊళ్ళోకొచ్చింది. బతిమిలాడి ఇలిచ్చింది కాంతం అద్దె మాటాడు. నాకూ నాలుగక్షరమ్ముక్కలు చెప్పండి అంది. ఉన్న నాలుగు కోళ్ళనూ, గేదెదూడనూ చూసుకోడం. పచ్చగడ్డి కోసుకొచ్చి ఓ పావలా తగ్గించి ఇస్త్రీకెళ్ళే కావిళ్ళకెయ్యడం. పగలు పనిపాటులు చూసుకుని సాయంత్రాలు సత్తెవతమ్మతో కథలూ, ఊసులూ, బుద్ధిపుడితే పలకమీద నాలుగు మాటల్రాసుకోడం. అట్టా కాంతం రోజులు కమ్మగా వెళ్ళిపోతున్నై.

తనకో మొగుడున్నాడన్న గురుగాని ఆడు తన్నొదిలేసి పోయాడన్న దిగులుగాని కాంతానికి లేవు. కాని ఎప్పుడో ఉరుమని పిడుగులా ఊడిపడి 'రా పోదాం' అని రెక్కట్టుగ్గుంజుతాడేమోననే భయం మాత్రంవుంది ఆ మాటే సత్తెవతమ్మతో అంటే- నీ కిష్టం లేకపోతే ఎవరూ ఏం చెయ్యలేరు అంటూ బోలెడు ధైర్యం చెప్పింది.

మొగుడంటే భయం అలాగే వున్నా. మొగాడంటే అసహ్యం పోయింది కాంతానికి, కాంపౌండరు కనకారావు ఊళ్ళో అడుగుబెట్టాక.

ఎప్పుడైనా మొగచూపు చురుక్కుమని గుచ్చుకుంటే చీదరించుకునే కాంతాన్ని కనకారావు చూపులు కట్టిపడేసినై.

వారానికోసారి మందులపెట్టె సైకిలకు తగిలించుకువొచ్చే కనకారావు కాంతంతో కళ్ళు కలిశాక రోజిడిసిరోజూ వసున్నాడు చిలిపిచూపుల పలకరింపుకు సిరి సిరి నవ్వులు బదులిచ్చేది కాంతం.

కళ్ళు కలిశాక మనసూరుకోదు. పాతికేళ్ళ వయసును పదిలంగా మోసున్న ఒళ్ళు మరి నావల్లగాదంది. వయసూ మనసూ పక్కాకుచేసి కనకారావు కలలు పండించింది కాంతం. ఎప్పటికప్పుడు ఈ సంగతి సత్తెవతమ్మతో చెబుదామనే అనుకునేది. కాని కొన్నాళ్ళాగి కనకారావుతో తేల్చుకుని ఇంకా మంచిమాటే చెబుదామని ఆగింది. కాని మరో మంచిమాట మురిసిపోతూ మొగట కనకారావు చెవిలో వేసింది.

సంగతి విన్న కనకారావు కలవరపడడం చూసి చిన్నబుచ్చుకుని కళ్ళు నింపుకుంది కాంతం.

కనకారావు చాల సేపు నచ్చజెప్పాడు. పెళ్ళయేంతవరకూ కాస్త జాగ్రత్తగా ఉండాలన్నాడు. పెళ్ళికి కాంతం మొగుడు ఏ అడ్డంకీ లేకపోయినా, తనవాళ్ళు నొప్పించడానికి కొంత టైం పడుతుందన్నాడు తనకింకా కొన్ని బాధ్యతలున్నాయన్నాడు అన్నీ సర్దుకుని నచ్చజెప్పి వస్తానని కాంతానికేవో మందులిచ్చి ఊరెళ్ళాడు.

కాంతం మనసు కష్టపెట్టుకున్నా మందులు మింగక తప్పలేదు

కనకారావు స్వతహాగా మంచివాడేనని పరిసికులు చక్కబెట్టుకుని తప్పకుండా వస్తాడని సత్తెవతమ్మ ఓదార్చింది

ఊళ్ళో రాణిలా తిరిగిన కాంతం తరవాత కాలు బైటపెట్టడానికే భయపడింది. ఎప్పుడూ విననివిసుర్లూ, వెక్కిరింపులూ ఇకలింపులూ, సకిలింపులూ ఎదురౌతున్నై.

పచ్చగడ్డి కోసుకొస్తుంటే కామందు కొడుకు కర్రతో అడ్డగించి. ఛీ అంటే కనకారావుకన్నా తీసిపోయానా'అన్నాడు.

"నాకింక పిల్లలుటరు. అయినా అరిసేతిలో నిమ్మపండల్లే చూసుకుంటా— గుట్టుగా నాతో పడుండు"మన్నాడు మరో పెద్దమనిషి.

ఒక్కసారిగా కొత్త రంగులో కనబడుతున్న సంఘాన్ని చూసి బెదిరిపోయింది కాంతం. సెలయేటి నీరులా సాగిపోయే జీవితంలో ఊహించని సుడిగుండాలకు ఉక్కిరిబిక్కిరైంది కాంతం

ఆ సమయంలోనే సాంబయ్య తిరిగొచ్చాడు

పలక్కపోయినా గుమ్మం బట్టుకు వొదలే

"జరిగినవన్నీ మరిచిపో మనిద్దరం ఒకటే" అన్నాడు

"పడి లెగిసినోడు బతుకు తెరువులో బలుపూ సులుపూ తెలుసుకుని తిరిగొచ్చాడు. ఎల్లమ్మా" అంది గంగవ్వ.

అయినా సరే నసలేదు కాంతం.

ఊరి పెద్దల్నిపిల్చి చెప్పించాడు సాంబయ్య.

అయిదుగురు పెద్దలూ, ఒక్కమాటగా కాంతం కాపరానికెళ్ళి తీరాలన్నారు. కాంతం తరుపున నిలబడి మాటాడేందుకెవరూ లేరు.

"పలకనేం మూగిమొద్దులా?" సాంబయ్య గాండ్రింపుకు వులిక్కిపడింది కాంతం.

చీకటిచిక్కబడింది. ఇల్లు దగ్గరబడింది. ఆ ఇంట్లో మునుపు గడిపిన మూణ్నెల్లూ గుర్తొచ్చి దడదడ లాడింది కాంతం.

గడపలో అడుగు పెట్టగానే "రామ్మా" అంటూ కాళ్ళకు నీళ్ళిచ్చింది సాంబయ్య మేనమామ పెళ్ళాం ముత్తాలమ్మ.

"అచెలొత్తా" అంటూ దడవతల్నుంచే బజార్నబడ్డాడు సాంబయ్య.

ఇరుగమ్మా. పొరుగమ్మా వచ్చి కాంతాన్ని పలకరించి వెళుతున్నారు.

"ఉడుకునీళ్ళెట్టాను కుసినొంటిమీదోసుకుని బువ్వదినమ్మా"

ముత్తాలమ్మ బలవంతంమీద లేచి ఏదో తిన్నాననిపించింది కాంతం.

ఊరు మాటుమణిగింది.

ఉండుండి కుక్కల అరుపులు వినబడుతున్నై.

సాంబయ్య మాట వినబడి అదిరిపడి లేచి కూచుంది కాంతం.

"ఏయ్ పొడుకున్నావా మారాణీ.... లేలే లే. అన్నవెట్టు."

"పెట్టానుతే రారా?" తడికవతలనుంచే పిలిచింది ముత్తాలమ్మ.

"నువ్వెందుకెట్టాల అది మొగుడికన్న వెట్టదా?" అంటూనే వెళ్ళి అన్నం ముందు కూచున్నాడు. ఆ మాటల్లో విసురూ.... గొంతులో జీరా విని కాంతం గుండె గుబగుబ లాడింది.

"ఎంటప్పుడే గురకలు దీత్తన్నావ్?" ఒదిగి నుంచున్న కాంతం జబ్బ మీద చేతికొద్దీ చరుసూ అన్నాడు సాంబయ్య.

"అప్పుడే ఏంటి అర్ధవరేత్రవుతుంటే ఈ వరదాకా యెక్కడున్నావ్?" మోటు సరసానికి మొకం చిట్లించుకుంటూ అంది కాంతం.

"ఈ వరదాకానా....కతలు.... కతలు అరికతలు వింటన్నానే. ఆ కతల్లో ఈరో ఆరెంపీ కనకారావు. ఈరోయినెవరో తెలుసా?"

కాంతం మాటాడలేదు.

"చెప్పవేం? చెప్పూ....చెప్పవూ.... చెప్పు తీసుకొక్కడా పెడుగుదానా."

పిడికిలి బిగించి అందినచోటల్లా గుద్దాడు.

పళ్ళుబిగించి వోర్చుకుంది కాంతం.

ఎప్పటికో నిద్రబటిన కాంతం తన ఒంటిమీద తారటాడుతున్న చేతుల్లో ఆత్రం ఆ శ్వాసలో ఆకలీ గమనించి అసహ్యించుకుంది. నాలుగురోజులు గడిచినై.

అతని కచ్చకూ ఇచ్చకూ ఒకేలా ఒళ్ళప్పజెప్పేస్తంది కాంతం.

'ఎప్పుడో నన్ను సంపేత్తాడు' అని ఒణికిపోయేది. అనరాని మాటలంటూ పడరాని


ఇవ్వండి: మీ కుటుంబానికొక చక్కని కానుక!!



టేప్ రికార్డర్లు

నాణ్యమైనది — ధర తక్కువ

సోనో విజన్,

ఏలూరురోడ్డు, విజయవాడ—2.

టేప్ రికార్డర్ల సేల్సు-సర్వీసులో అగ్రగాములు

Suvarna




సీతాంజన్®

(పై పూతకు మాత్రమే)

నొప్పులకు

రొంప, జలుబు, తలనొప్పి, దగ్గు, నడుమునొప్పి కీళ్ళనొప్పులు, కండరమునొప్పి, బెణుకునొప్పి తగ్గించును

అన్ని షాపులయందు లభించును

తయారు:- శ్రీరామ ఆయుర్వేదనిలయం(Regd)

కత్తిపూడి (వయా) చేబ్రోలు తూ॥గో॥ జిల్లా (ఆం॥ప్ర)

శ్రీకాకుళం, విజయనగరం, వైజాగ్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు మినహా మిగతా జిల్లాలలో స్టాకిస్టులు కోరబడుచున్నారు.

# WANTED


ప్రభుత్వ కార్యాలయములందు. Bank అందు క్రింది ఉద్యోగములు పొందుటకు ఇచ్చు శిక్షణకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

| పని పేరు | అర్హత | ఖాళీలు | శిక్షణా విభాగం |
|---|---|---|---|
| A/C Assistants | S.S.C | 340 | Accountancy |
| A/C. Supervisors | Inter | 120 | D. Com. |
| Clerks, Cashiers | Degree | 300 | Banking |
| Managers | Degree | 80 | Management |

Training Period :— 3 to 6 Months [ఆయా కోర్సులకు తగినట్లు] Salary :— Rs. 460/- 850/- వరకు పొందుటకు అర్హులు. శిక్షణా కాలములో రు. 150/- Scholarship లభించును. హాస్టలు గదులు ఉచితంగా ఇవ్వబడును. C. A, I. C. W. A; చదువుటకుకూడా ఇది మార్గదర్శకముగా నుండును. Application form & Prospectus కొరకు రు. 3/- M. O. లేక Crossed Postal Order పంపి పొందవచ్చును.

N. B: Postal మూలముగా కూడా ఈ శిక్షణ లభించును.

PRINCIPAL, TECHNICAL EXAMINATIONS TRAINING COLLEGE
P. H. ROAD, MADRAS-600107




బాధలు పెడుతుంటే ఎప్పుడో నేనే చేతి కందింది విసిరెయ్యనుగదా అనుకునేది.

పదేళ్ళనాడు పసుపుతాడుకట్టి ఒంటిమీది బంగారమంతా ఒలుచ్చుకు పోయాడు. ఇన్నాళ్ళూ నేను సచ్చానో, బతికానో సూడలేదు. ఇవాళొచ్చి నా పేరు సెడగొట్టా వంటున్నాడు. ఏది నాయమో చెప్పడానికి ఊరికి నోరు లేదా? ఈడి సేతిలో ఎందుకు సావాలీ అనుకుంది. అనుకున్నదే తడవుగా సంచీబట్టుకుని బయల్దేరింది.

"ఎల్లమ్మా అక్కడన్నా సుఖంగా బతుకు" అని కన్నీళ్ళతో సాగనంపింది ముత్తాలమ్మ.

ఇంటికెళ్ళి తాళం తీసి లోపలికెళ్ళి హమ్మయ్య అనుకుంది. వెనక తలుపు తీయగానే చల్లటి గాలి ఒంటికి తగిలి సత్తువొచ్చినట్లనిపించింది. ఇలూ నాకిలీ తుడుచుకుని, వసారాలో మంచం వాల్చుకుని పడుకుంటే అమ్మ పక్కన పడుకున్నట్టు కమ్మగా నిద్రపట్టింది.

లేచేసరికి సాయంత్రమైంది. సాంబయ్యా, ఆ చూపూ, మాటా గుర్తొచ్చి గుండె దడదడ లాడింది. ఓసారి నాలుగు పక్కలా చూసి హమ్మయ్య ఇంటి కొచ్చేశా అనుకుంది.

పొద్దోయాక నలుగురితో ఇసారిచ్చి నాయం జెయ్యమనడగాల అనుకుంది కాంతం. తొట్టి కడిగి నాలుక్కుండలు నీళ్ళు తెచ్చి పోసింది. తల వేలాడేసిన మొక్కలకాక్కసిన్నీళ్ళు పోసింది. గిద్దెడు బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టింది. పుల్లా పుడకా బెట్టి మంటబెడుతూ పొయ్యి కెదురుగా కూచుంది కాంతం.

ఉడికే అన్నంలాగే కిందామీదా అవుతూంది కాంతం మనసు కూడా.

నందలడిపోయింది బుడ్డెలిగించాల అనుకుని లేచి వెనక్కుతిరిగిన కాంతం కెవ్వుమంది. ఎర్రబడ్డ కళ్ళతో మిర్రి మిర్రి చూస్తూ గుమ్మం పొడుగునా నిలబడ్డాడు సాంబయ్య.

జుట్టుపట్టుకుని ఈడ్చుకెళ్ళి పెద్దమనుషుల ముందు నిలబెట్టాడు.

కాంతం అందరిముందూ వాడిమీద అసహ్యాన్ని బయట బెటడంతో రెచ్చిపోయి గొడ్డును బాదినట్టు బాదాడు.

చుటూఉన్నోళ్ళు చూసూ ఊరుకోలేదు. అడ్డొచ్చినోళ్ళందర్నీ అవతలికితోసేశాడు. అప్పుడే తాళ్ళగిసి తిరిగొస్తున్న రాములి ఒరలో కత్తి లాక్కున్నాడు.

"నా ఇంటిపేరు సెడగొట్టావు. నిన్ను బతకనివ్వను. ఎవుడడ్డమొస్తాడో సూత్తా" అంటూ రంకె లేసంటే-

ఎత్తిన సాంబయ్య చేతిని రెండు చేతుల్తోనూ పట్టుకుని సివంగిలా గర్జించింది కాంతం.

"ఎందుకు సంపుతావు నన్ను. నేన్నితో రాను. నువ్వెవుడికి సెప్పుకుంటావో చెప్పుకో. చెప్పు-నలుగురి ముందూ నువ్వు సేసిన్నాయమేంటో. నే నీకు సేసిన అన్నాయమేంటో. నువ్వు పదేళ్ళు అతీగతీ కనుక్కోకుండా ఉంటం నాయమైతే, నేను జేసింది నాయమే."

పదిమంది తమ్ముకొచ్చి ఇద్దర్నీ విడదీశారు. 'ఎవరి బతుకాళ్ళు బతకండి. రేపెల్లి సీటీలు రాసిత్తా' వన్నారు.

"కనకారావు జత కలిశాక కన్నూ, మిన్నూ కనబడలేదు. రోగమలిగింది" అని కొందరన్నారు. 'యిట్టవైతే ఏలుకోవాలి లేకపోతే లేదుగాని, కొట్టి సంపడాని కాడెవడు' అని మరి కొందరన్నారు.

"అదిగాపోతే దాని బాబులాంటి దింకొకతి. దాన్ని సంపి జైలుపాలవుతావేంట్రా" అని లౌక్యంగా సాంబయ్యను సలబరిచారు మరికొందరు.

పీడిన జుట్టు విదిలించి ముడివేసుకుంటూ యింటిదారి పట్టింది కాంతం.

ఓరగా వేసున్న తలుపు సందునుంచీ వెలుతురు చారలుగా వాకిట్లో పడుతుంటే. "ఎవరెలిగించారు దీపం" అని ఆశ్చర్యంగా యింట్లో అడుగెట్టింది కాంతం.

అవతలి గదిలో ఏవో సర్దుకుంటూంది సత్తెవతమ్మ.

సుడిగాలిలా దూసుకెళ్ళి చాపచుట్టలా సత్తెవతమ్మ ముందు కూలబడింది కాంతం.

తల్లిలా ఒళ్ళోకి తీసుకుని సముదాయించింది సత్తెవతమ్మ.

"ఇంతకుముందే వచ్చాను. గంగవ్వ జరిగిందంతా చెప్పింది. ఇంకేడవకు. ధైర్యంగా ఉండు. కనకారావు నన్ను కలిశాడు నాకన్నీ చెప్పాడు."

తల అడ్డంగా ఊపింది కాంతం.

"ఒద్దండీ, ఇంకా పేరెత్తవద్దు. నాకెవరితోడూ ఒద్దు. ఇలా బతకనివ్వండి. తాడుగట్టనోడు బజారుకు లాగి దాని పరువు తీశాడు. నమ్ముకునోడు నట్టేట్లో ఇడిసి తనపరువు కాపాడుకున్నాడు. ఊడధికారవుందని ఒళ్ళెరిసి ముక్కలుజేశాడు. ఆడు ఆశలు సంపి గుండెల్లో కలతరేపాడు" ఇంకచాలు నన్నిలా బతకనివ్వండి అంది కాంతం.

ఆ రాత్రి చాలా పొద్దుబోయేంతవరకూ ఇద్దరూ కష్టాలు కలబోసుకున్నారు. తెల్లవారకముందే బయటకొచ్చిన సత్తెవతమ్మ విచ్చుకునే వేకువ రేకుల్లో కనకారావు రావడం చూసింది.